# స్నేహబంధం

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు

"అమ్మాయి నచ్చింది, మీ కుటుంబం గురించి ఇప్పటికే విని వున్నాం. మాకు చాలా సంతృప్తిగా వుంది. మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకోవడానికి మాకెటువంటి అభ్యంతరాలూ లేవు. మాకు కట్నకానుకలు, లాంఛనాలు అక్కర్లేదు" అన్నారు వేణుగోపాలరావుగారు భార్యతోను, కొడుకుతోను సంప్రదించిన అనంతరం.

అప్పటిదాకా టెన్షన్‌తో వేడెక్కిన వాతావరణం తేలికైంది.

రంగనాధంగారి ముఖంలో, ఆయన భార్య పార్వతమ్మ ముఖంలో ద్యోతకమవుతున్న సంతోషాన్ని చూస్తే వెయ్యి కాగడాల వెలుగు కూడా దిగదుడుపే అనిపిస్తోంది.

కాదా మరి! వాళ్లమ్మాయి కాత్యాయనికి అదే మొదటి పెళ్లి చూపులు. మగ పెళ్లివాళ్ల గొంతెమ్మ కోర్కెలు ఎలా వుంటాయో విని ఉన్నారు. ఆడపిల్లల జీవితాలు రావణ కాష్టాల్లా రగులుతూనే వున్నాయి. అందుకే పిల్లకి పెళ్లిచూపులంటే ఎంతో ఆందోళన చెందారు. కానీ ఆమె ఇంత అదృష్టవంతురాలనుకోలేదు.

అంతలోనే-

"వేణుగోపాలరావుగారూ! మీకో చిన్నమాట" అన్నారు రంగనాధంగారు.

ఏమిటన్నట్లు అందరూ ప్రశ్నార్థకంగా చూసారు.

"మా అమ్మాయి పక్కన వుందే... ఆ అమ్మాయి ఎలా వుంది?" అడిగారు.

అందరూ ఆమెవైపు చూసారు.

"బంగారు బొమ్మలా వుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు" తృప్తిగా చూస్తూ అన్నారు వేణుగోపాలరావుగారి భార్య అనసూయమ్మ.

"నిజమేనమ్మా. పిల్ల బావుంటుంది. వాళ్ల కుటుంబం చాలా మంచిది. వీళ్ల నాన్నా నేనూ చిన్నప్పట్నించీ మిత్రులం. బ్రతుకు బండిని గుట్టుగా లాక్కొచ్చాంగానీ వెనుక ఏమీ వేసుకోలేకపోయాము. ఈ అమ్మాయిని ఇప్పటికి ఎంతోమంది చూసారు. కానీ నా స్నేహితుడు కట్నం ఇవ్వలేని అసమర్థతకి ఈమె ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. ఈ అమ్మాయి మీకు నచ్చితే దయచేసి మీ అబ్బాయికి చేసుకోవడానికి అంగీకరించండి. నేను చేసే ఈ మంచిపని మా అమ్మాయికి మంచి భవిష్యత్తుని ప్రసాదిస్తుందని నా నమ్మకం" అన్నాడు.

"మీలాంటి వ్యక్తిని నేనింతవరకూ చూడలేదు. మీ మంచితనానికి చేతులెత్తి నమస్కరించాలనిపిస్తోంది. పక్కవాళ్ల సంబంధాలు చెడగొట్టే వాళ్లను చూసానుగానీ స్నేహితుడికోసం, అతడి కూతురి కోసం మీ అమ్మాయి జీవితాన్ని పణంగా పెట్టిన మీ విశాల హృదయానికి జోహార్లు. మీ స్నేహబంధం ఎందరికో ఆదర్శం కావాలి" అన్నారు వేణుగోపాలరావుగారు.

అందరి హృదయాలూ ఆర్ద్రమయ్యాయి. ఆ తరువాత ఆనందమయమయ్యాయి. అందరూ శ్రీనివాసరావుగారింటికి బయల్దేరారు.

అప్పటికే ఆ విషయం విన్న శ్రీనివాసరావుగారు పెళ్లివారిని లోపలికి సాదరంగా ఆహ్వానించి చెమర్చిన కళ్లతో స్నేహితుడిని గాఢాలింగనం చేసుకున్నాడు.

★



కథా నిలయం